సాక్షి
ఒడిశా
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



హుండీ ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,13,130
బంగారం : 11 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
వెండి : 47 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/ పూరీ

సీనియర్ సిటిజన్లకు సన్మానం



రాయగడ: స్థానిక ఉత్కళ బ్రాహ్మణ సేవా సమాజం ఆధ్వర్యంలో బాలాజీ నగర్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర కల్యాణ మండపం ప్రాంగణంలో ఆదివారం సీనియర్ సిటిజన్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 28వ వినాయక వార్షిక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో గల 15 మంది సీనియర్ సిటిజన్ల దంపతులను సత్కరించారు. సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, సాధారణ కార్యదర్శి భళ్లముడి నాగరాజుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

న్యూస్‌రీల్

గణేష్ మండపాల సందర్శన



గుసాని సమితిలోని గణేష్ మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: గుసాని సమితిలోని సర్దాపురం, గురండి, జాజిపురం గ్రామాల్లో నెలకొల్పిన వినాయక చవితి పెండాళ్లను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, పలువురు సర్పంచులు, సమితి సభ్యులు ఉన్నారు.

'అత్యాచారాలు అరికట్టాలి'



ప్రసంగిస్తున్న ఇంద్రాణి దాస్

జయపురం: దేశంలో మహిళలు, బాలికలపై లైంగిక దాడులు కలవరపరుస్తున్నాయని నారీ నిర్యాతన విరోధి నాగరిక కమిటీ కన్వీనర్ ఇంద్రాణీ దాస్ ఆవేదన వ్యక్తం చేసారు. ఆదివారం స్థానిక సరోజినీ భవనంలో నారీ నిర్యాతన విరోధీ నాగరిక కమిటీ నిర్వహించిన కన్వెన్షన్‌లో ఆమె వక్తగా పాల్గొన్నారు. ఒడిశాలో రోజూ 180కిపైగా మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, అత్యాచారాలు నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కోల్‌కతాలో పీజీ చేస్తున్న డాక్టర్‌ను హత్య చేశారని, ఉత్తరప్రదేశ్‌లో 19 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్ జరిగిందని, ఉన్నావో వద్ద మైనర్‌ను హత్య చేశారని తెలిపారు. అవిభక్త కొరాపుట్ జిల్లా జయపురంలో నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని ఈ వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకుందని, మల్కన్‌గిరిలోనూ సామూహిక లైంగిక దాడి జరిగిందని తెలిపారు. ప్రజలు వీటిపై చైతన్యం పెంచుకోవాలని సూచించారు.

బీహారీ మద్యం తయారీ కేంద్రంపై గిరిజనుల దాడి



చందాహండి సమితి మద్యం తయారీ కేంద్రంపై దాడి చేస్తున్న గిరిజనులు

కొరాపుట్: బీహారీ మద్యం తయారీ కేంద్రంపై గిరిజనులు సామూహికంగా దాడి చేశారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి వంతెబెడ గ్రామ పంచాయతీ నువాపెడ గ్రామానికి చెందిన స్థానికులు ఈ దాడిలో పాల్గొన్నారు. ప్రభుత్వ అనుమతితో ఉన్న ఈ సారా తయారీ కేంద్రం వద్ద గిరిజనులు మద్యంకు బానిసలైపోతున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని ఎత్తివేయాలని అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. దీంతో మూకుమ్మడిగా దాడి చేసి ధ్వంసం చేశారు. ఆలస్యంగా చేరుకున్న చందాహండి పోలీసులు గిరిజనులకు నచ్చజెప్పి అక్కడి నుండి తరలించారు.

కార్పొరేషన్‌గా ప్రకటించాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు

జయపురం: జయపురం మున్సిపాలిటీని కార్పొరేషన్ (మహానగర్)గా ప్రకటించాలని జయపురం మున్సిపల్ మాజీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్వయం పాలన దినోత్సవం సందర్భంగా కమిటీని ఏర్పాటు చేశారు. పట్టణంలోని పెద్దలతోపాటు మాజీ కౌన్సిలర్లు ఆదివారం సమావేశమయ్యారు. మహానగరంగా ప్రకటించాలని తీర్మానించారు. జయపురం పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కార్పొరేషన్‌గా ప్రకటించకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ మంత్రి రబినారాయణ నందో, మాజీ కౌన్సిలర్లు బాలా రాయ్, బినోద్ మహాపాత్రో, డాక్టర్ సురేష్ దాస్, మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణ రథ్, మాజీ చైర్మన్ ఆర్. పద్మ, మాజీ వైస్ చైర్మన్లు దుర్గా ప్రసాద్ శర్మ, వి.ప్రసాద రావు, మాజీ కౌన్సిలర్లు శశి పట్నాయక్, ఎ.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కొత్త బస్టాండు వద్ద భీంరావ్ ఎస్సీ, ఎస్టీ సెల్ అలియా శోబోరో, కౌన్సిలరు అమ్ములమ్మ



స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్న పురపాలక చైర్మన్, సిబ్బంది

పర్లాకిమిడి: అఖిల భారత స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షురాలు మాట్లాడుతూ, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఒడిషాలో అతి పురాతన, రెండో అతిపెద్ద పురపాలక సంఘం పర్లాకిమిడి అని అన్నారు. పురపాలక సంఘం పరిధిలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ఇంకా అనేక పథకాలకు నిధులు ఖర్చుపెట్టి సర్వాంగ సుందరంగా తీర్చుదిద్దుతామని అన్నారు. అనంతరం పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న అత్యుత్తమ సేవలు అందించిన సిబ్బందికి అవార్డులను చైర్మన్ నిర్మల అందజేశారు. ఉత్తమ ఇళ్ల పన్నులు వసూలు చేసిన అలియా శోబోరో, మనోజ్ శతపతికి అవార్డులను చైర్మన్ నిర్మలా అందజేశారు. అంతకు ముందు కొత్త బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వార్డు నంబర్ 1 కౌన్సిలరు అలిజింగి అమ్ములమ్మ పూలమాలలు వేసి వందనం సమర్పించారు. అలాగే పురపాలక సంఘం కార్యాలయం, పాత బస్టాండు పార్కు వద్ద మహారాజా కృష్ణచంద్ర గజపతికి విగ్రహానికి పూలమాలలు సమర్పించి వందనాలు సమర్పించారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద శ్రీకృష్ణచంద్ర గజపతి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చైర్మన్ నిర్మలా శెఠి



స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి

కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షులు లెంక మధు, కౌన్సిలర్లు బాలకృష్ణ పాత్రో, బబునా బెహారా, త్రిపాఠి, అమ్ములమ్మ పురపాలక ఈఓ, లక్ష్మణ ముర్ము తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: పట్టణ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ ఆడిటోరియంలో ఆదివారం నాడు మున్సిపాలిటీ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కలెక్టర్ రాష్ట్రంలో ఉత్తమ మున్సిపాలిటీగా అన్ని రంగాల్లో ముందడుగు వేసేలా అధికారులు, పాలకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని వాటిని సకాలంలో పరిష్కరించేందుకు పాటుపడాలని అన్నారు. రహదారుల నిర్మాణం, పరిశుభ్రత పాటించడంపై యంత్రాంగం శ్రద్ధ వహించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల మధ్య నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ కుమార్ పట్నాయక్, వైస్ చైర్మన్ శుభ్రా పండ, కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుణుపూర్‌లో..

స్వపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని గుణుపూర్ మున్సిపాలిటీ యంత్రాంగం నిర్వహించిన సమావేశంలో గుణుపూర్ బీడీఓ స్వస్తిక్ జమాదర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపాలిటీ చైర్మన్ మమత గౌడొ, వైస్ చైర్మన్ శివ కుమార్ గౌడొ, కార్యనిర్వాహక అధికారి సంతోష్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గౌడొ మాట్లాడుతూ అందరి సహకారంతో గుణుపూర్‌ని అభివృద్ధి పరచాలని ఆకాంక్షించారు.



విద్యార్థికి బహుమతిని అందిస్తున్న కలెక్టర్ కులకర్ణి



ప్రసంగిస్తున్న గుణుపూర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మమత గౌడో తదితరులు



వంటల పోటీలో పాల్గొన్న మహిళలు

బొరిగుమ్మలో హర్షాతిరేకాలు



బొరిగుమ్మలో బీజేపీ నాయకుల ర్యాలీ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

కొరాపుట్: రాష్ట్ర స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత గుర్తించిన మున్సిపాలిటీలు, ఎన్ఏసీల జాబితా ప్రకటించారు. అందులో బొరిగుమ్మ పంచాయతీ కేంద్రానికి ఎన్ఏసీ హోదా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పార్టీలకు అతీతంగా ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. అధికార బీజేపీకి చెందిన గౌతం శాంత్ర నేతృత్వంలో కార్యకర్తలు బొరిగుమ్మ మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య జంక్షన్‌లో ప్రజలకు మిఠాయి పంచి పెట్టారు. కాంగ్రెస్‌కు చెందిన జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి మీడియాతో మాట్లాడుతూ ఇది బొరిగుమ్మ ప్రజల పోరాట ఫలితమన్నారు. బీజేడీకి చెందిన మాజీ మంత్రి రబి నారాయణ నందో మాట్లాడుతూ గతంలోనే మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బొరిగుమ్మ ని ఎన్ఏసీగాగా ప్రకటించిన విషయం గుర్తు చేసారు.

బారంగ్‌లో తొలి అంధుల విశ్వవిద్యాలయం

- 30 ఎకరాల స్థలం గుర్తింపు



భువనేశ్వర్:

దృష్టి లోపం ఉన్న వారి కోసం దేశంలోనే మొట్టమొదటి విశ్వవిద్యాలయం బారంగ్ గంగేశ్వర్ మౌజాలో నిర్మిస్తున్నారు. దీని కోసం భూమి గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. దివ్యాంగుల సామాజిక భద్రత, సాధికారత (ఎస్ఎస్ఈపీడీ) తుది ఆమోదం కోసం వేచి ఉంది. గంగేశ్వర్ మౌజాలో ఈ విశ్వవిద్యాలయం కోసం 29.75 ఎకరాల భూమిని గుర్తించారు. కటక్ నగరంలో విశ్వవిద్యాలయాన్ని నిర్మించడానికి అనుకూలమైన స్థలం లభ్యం కాకపోవడంతో జంట నగరాల మధ్య బారంగ్ ప్రాంతంలో సుమారు 40 ఎకరాల స్థల సేకరణకు ఎంపిక చేశారు. తదుపరి దశలో విశ్వవిద్యాలయం కోసం సుమారు 30 ఎకరాల భూమిని ఖరారు చేశారు. ఈ భూమిని ఎస్ఎస్ఈపీడీ పేరుకు బదలాయించేందుకు ఇప్పుడు ప్రక్రియ ప్రారంభమైంది. దీని కోసం , జిల్లా సామాజిక భద్రతా అధికారికి సమన్వయ బాధ్యత అప్పగించారు. భూ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసే బాధ్యతను ఆ శాఖకు అప్పగించారు. ప్రతిపాదిత తొలి అంధుల విశ్వ విద్యాలయానికి భీమ భొయ్ సెంట్రల్ యూనివర్సిటీ ఫర్ ది బ్లైండ్ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయడం గమనార్హం. గతంలో, స్థలం ఎంపిక సమయంలో కేంద్ర ప్రతినిధి బృందం కటక్, భువనేశ్వర్‌లోని వివిధ ప్రదేశాలను సందర్శించింది. అయితే, ఈ విద్యా సంస్థ యొక్క జాతీయ ప్రాముఖ్యత దృష్ట్యా కటక్, భువనేశ్వర్ మధ్య ప్రాంతాన్ని ఎంపిక చేశారు. మరోవైపు, ప్రస్తుతం రాష్ట్రంలో అంధుల కోసం దాదాపు 26 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు యూనివర్సిటీ ఫర్ ది బ్లైండ్ నుంచి మరింత ప్రయోజనం పొందగలరని జిల్లా సామాజిక భద్రతా అధికారి మనోజ్ కుమార్ రథ్ అన్నారు.

ఉత్సాహంగా మాస్ సైకిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు



సైకిల్ ర్యాలీలో తైక్వాండో విద్యార్థులు



సైకిల్‌ర్యాలీని ప్రారంభించిన జిల్లా క్రీడాధికారి

పర్లాకిమిడి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం మాస్ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ర్యాలీని అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఫాల్గుణీ మఝి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి హైస్కూల్ జంక్షన్, ప్యాలస్ వీధిగుండా సాగింది. వివిధ పాఠశాలల విద్యార్థులు, కిక్ బాక్సింగ్ విద్యార్థులు, క్రీడాకారులు, ఎం.ఆర్.బాలుర హైస్కూల్ పీఈటీ, హెచ్ఎం డి.శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

కాశీనగర్‌లో ప్రాజెక్టుల రూపకల్పన



వేదికపై ఎమ్మెల్యే రూపేష్, చైర్మన్ సుధారాణి, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని కాశీనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద స్థానిక సంస్థల స్వపరిపాలన దినోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. చైర్మన్ మేడిబోయిన సుధారాణి జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాశీనగర్ నగరపాలక సంస్థలో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూపకల్పన చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్ఏసీ చైర్మన్ సుధారాణిని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి సత్కరించారు. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, సబ్‌కలెక్టర్ అనుప్ పండా, వైస్ చైర్మన్ రఘురాం సాహు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, కాశీనగర్ ఎన్ఏసీఈవో భాగవత్ సాహు, తహసీల్దార్ సుధీర్ నందో, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కాశీనగర్ ఎన్ఏసీ చైర్మన్ సుధారాణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు

సెంచూరియన్ యూనివర్సిటీతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం



సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధులతో ఎంఓయూలు మార్చుకుంటున్న ఉత్తర ప్రదేశ్ పోలీసులు



కార్యక్రమానికి హాజరైన ఉత్తర్ ప్రదేశ్ పోలీస్ ఉన్నతాధికారులు, సెంచూరియన్ యూనివర్సిటీ నిపుణులు

కొరాపుట్, పర్లాకిమిడి: సెంచూరియన్ యూనివర్సిటీ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది. ఉత్తర ప్రదేశ్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ వర్సిటీల మధ్య ఈ నెల 29న ఎంఓయూ కుదిరింది. లక్నోలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా పరిశోధనాత్మక, న్యాయ సంబంధిత, సాంకేతిక అంశాల్లో రెండు సంస్థలు పరస్పరం సహకారం అందించుకుంటాయి. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ డీజీపీ రాజీవ్ కృష్ణతో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా సమాలోచనలు చేశారు. డీజీపీ మాట్లాడుతూ ఈ రెండు సంస్థల కలయిక పరిశోధన రంగంలో నూతన మార్పులు తీసుకువస్తుందని తెలిపారు. సెంచూరియన్ వర్సిటీ ప్రెసిడెంట్ ముక్తికాంత్ మిశ్రా మాట్లాడుతూ తాము 2016లోనే గుజరాత్ ఫోరెన్సిక్ విభాగంతో పనిచేశామని, ఇప్పుడు ఈ కొత్త ఒప్పందంతో ఫోరెన్సిక్ సేవలు సమాజానికి ఉపయోగపడతాయన్నారు. ఈ ఒప్పందంపై ఉత్తర్ ప్రదేశ్ ఏడీజీపీ నవీన్ అరోరా, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సుప్రియ పట్నాయిక్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ లక్నో లోని స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కి చెందిన డాక్టర్ సుధీర్ కుమార్, సెంచూరియన్ యూనివర్సిటీ అంతర్జాతీయ, ప్రభుత్వ సంబంధాల డైరెక్టర్ మెనాలిసా ఘోష్, డాక్టర్ రీనా, సి.జమాతానీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అధిక లగేజీకి అదనపు చార్జీలు

భువనేశ్వర్: అధిక లగేజీతో తోటి ప్రయాణికులకు అసౌకర్యం నివారించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోంది. టికెట్ లేని ప్రయాణం సామాజిక నేరం తరహాలో అధిక లగేజీ అదనపు భారం నినాదంతో ఆంక్షలు విధిస్తోంది. విమాన యానం తరహాలో ప్రయాణ శ్రేణి ప్రామాణికంగా రైలు ప్రయాణికులకు లగేజీ పరిమితం చేసేందుకు రంగం సిద్ధం చేసింది. అదనపు లగేజీకి అదనపు చార్జీలు వడ్డించే యోచనతో రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. ప్రముఖ రైల్వే స్టేషన్లలో తొలుత ఈ చర్యను చేపట్టి అంచెలంచెలుగా దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లకు విస్తరిస్తారు. అపరిచిత లగేజీపై అదనపు చార్జీలు వడ్డించడంతో అసౌకర్యవంతమైన భారీ లగేజీ తొలగిస్తారు.

అదనపు లగేజీ చార్జీలు

పరిమితి మించిన లగేజీకి అదనపు చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. సాధారణ బుకింగ్ కంటే ఒకటిన్నర (1.5) రెట్లు ఎక్కువ లెక్కింపుతో జరిమానా విధిస్తారు. కనీస చార్జీ రూ. 30గా పరిగణనలోకి తీసుకుంటారు. కోచ్‌లలో అధిక స్థలాన్ని ఆక్రమించే భారీ బ్యాగులకు కూడా జరిమానాలు విధించే యోచన పరిశీలనలో ఉంది. ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలతో లగేజీ బరువు తూకం వేస్తారు.


ప్రయాణ శ్రేణి లగేజీ పరిమితి

శ్రేణి	బరువు (కిలో గ్రాముల)
ప్రథమ ఏసీ	70 (15 కిలో గ్రాముల వరకు సడలింపు)
ద్వితీయ ఏసీ	50 (10 కిలో గ్రాముల వరకు సడలింపు)
తతీయ ఏసీ, స్లీపర్	40 (10 కిలో గ్రాముల వరకు సడలింపు)
సాధారణ	35 (10 కిలో గ్రాముల వరకు సడలింపు)

పాత్రికేయుని ఇంటిలో చోరీ



సీసీ ఫుటేజీలో దుండగుడిని గుర్తిస్తున్న పోలీసులు



చోరీకి పాల్పడిన వ్యక్తి

రాయగడ: స్థానిక గౌతం నగర్ రెండో వీధిలో నివసిస్తున్న పాత్రికేయుడు ఇప్పిలి సర్వేశ్వరరావు ఇంటిలో దొంగతనం జరిగింది. శనివారం రాత్రి ఇంటిలో అంతా నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి ఇంటి వెనుక నుంచి చొరబడిన దుండగుడు ఇంటిలో గల గదుల్లో నిద్రిస్తున్న వారి తలుపులకు గడియపెట్టి అనంతరం పూజా గదిలోకి ప్రవేశించి అక్కడ గల వెండి పూజా సామగ్రితో పాటు ఇత్తడి వస్తువులు దొంగిలించాడు. తెల్లవారి లేచి చూసేసరికి గది తలుపు బయట నుండి గడియపెట్టి ఉండటంతో మిత్రునికి ఫోన్ చేసి తలుపు తెరిపించాడు. పూజా గదిలోకి వెళ్లి చూడగా సామాన్లు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి ఆదివారం చేరుకున్న పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలో గల ఒక ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దుండగుడిని గుర్తించారు.

క్లుప్తంగా

రాష్ట్ర కార్యక్రమాల సంచాలకుడిగా సునీల్ శర్మ



నియామకపత్రం అందుకుంటున్న సునీల్ శర్మ

శ్రీకాకుళం కల్చరల్: సేవ్ టెంపుల్స్ భారత్ రాష్ట్ర కార్యక్రమాల సంచాలకుడిగా నగరానికి చెందిన తెన్నేటి సునీల్ శర్మను నియమితులయ్యారు. ఈమేరకు విశాఖలో జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో సునీల్ శర్మకు అధ్యక్షుడు కేశినేని శ్రీనివాస్ (గజల్) నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ, గోరక్షణ, మఠాలు, పీఠాలు, సాధువులు, సంతుల పరిరక్షణకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

ఆపదలో అండగా..



సాయం అందిస్తున్న కళింగ కోమటి సంఘ ప్రతినిధులు

కంచిలి: సోంపేట పట్టణానికి చెందిన పొట్నూరు సాయిరోహిత్ కాలేయం పాడవ్వడంతో శస్త్రచికిత్సకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కంచిలి పట్టణ కళింగ కోమటి సంఘం సభ్యులు రూ.1,65,211 సాయాన్ని ఆదివారం అందించారు. అంతకుముందు కూడా కొంత మొత్తాన్ని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సాయిరోహిత్ తల్లిదండ్రులు, సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మ విరిగిపడి ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మ

జలుమూరు: సురవరం పంచాయతీ దొంపాక వద్ద ఆదివారం వేకువజామున ఎల్.కె.రోడ్డుపై మర్రి చెట్టుకొమ్మ విరిగిపడటంతో ఉదయం పది గంటల వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. గతంలో కూడా ఇదే రోడ్డు మీద ఓ చెట్టు కొమ్మ విరగడంతో అప్పుడు కూడా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. తరచూ ఇదే చెట్టు నుంచి కొమ్మలు పడటంతో వాహన చోదుకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డు మీదుగా వందలాది ద్విచక్ర వాహనాలు, పాదచారులు, పొలం పనులకు వెళ్లే రైతులు రాకపోకలు సాగిస్తుంటారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

శ్రీకాకుళం క్రైమ్ : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని.. భూ కబ్జాలు, సెటిల్మెంట్లు, ఇతర ఆర్థిక లావాదేవీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ హెచ్చరించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పేకాట, బెట్టింగ్, గంజాయి సేవనం, క్రయ విక్రయాలు, బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్సు చేయడం, వినాయక ఉత్సవాల్లో వర్గ విభేదాలు సృష్టించి అల్లర్లకు పాల్పడటం వంటివి తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆనందరావుకు సత్కారం



ఆనందరావు, అరుణకుమారి దంపతులను సన్మానిస్తున్న అతిథులు

టెక్కలి: వసతి గృహం సంక్షేమాధికారిగా సత్తారు ఆనందరావు చేసిన సేవలు ఎనలేనివని వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమాధికారి టి.త్రినాథరావు కొనియాడారు. సంతబొమ్మాళి మండలం నౌపడ వసతి గృహం సంక్షేమాధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సత్తారు ఆనందరావు, అరుణ కుమారి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఓవైపు వసతి గృహం సంక్షేమానికి కృషి చేస్తూ మరో వైపు అసోసియేషన్ బాధ్యతల్లో కీలకంగా పనిచేస్తూ అందరి మన్ననలను పొందిన వ్యక్తి ఆనందరావు అని కొనియాడారు. అనంతరం ఆనందరావు, అరుణకుమారి దంపతులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమాధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.గురువులు, వార్డెన్లు డి.రామారావు, గ్రామపెద్దలు కె.విష్ణుమూర్తి, వి.కృష్ణారావు, కెప్టెన్ ఎం.మన్మధరావు, ఎస్.కరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

- జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



ఉద్యానవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, ప్రజలు



మేఘమల్లి తోట ఉద్యానవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్

జయపురం: జయపురం పట్టణ అభివృద్ధికి, పారిశుద్ధ్య నిర్వహణకు కౌన్సిల్ కట్టుబడి ఉందని మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి స్పష్టం చేశారు. ఆదివారం స్వయం పాలన దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పారిశుద్ధ్యం మెరుగుపర్చడంలో ప్రజలు సహకరించాలని కోరారు. తమ కౌన్సిల్ వచ్చిన తరువాత అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, మరికొన్ని పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా వైస్ చైర్మన్ బి.సునీత, కార్యనిర్వాహక అధికారి పూజా రౌత్ పాల్గొన్నారు. ఇంజినీర్ చైతన్య బక్షీ, ప్రతాప్ కుమార్ ఆచార్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ పారిశుద్ధ్య శ్రామికులు, ఇతర ఉద్యోగులకు వస్త్రాలు, బహుమతులు అందించి సన్మానించారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేఘమల్లి తోట ఉద్యాన వనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గోశాలలను ప్రారంభించారు. జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శొశ్యారెడ్డి, కార్యనిర్వాహక అధికారి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి



పాత్రికేయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కద్రక, వేదికపై రథో, పాడి, తదితరులు

- రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక

రాయగడ: పాత్రికేయులు గ్రామీణ ప్రాంత సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సమావేశం హాల్‌లో ఆదివారం రాయగడ జిల్లా వెబ్ మీడియా అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసంగించారు. జిల్లాలో ఎన్నో గ్రామాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. పాత్రికేయులు తమ కర్తవ్యాన్ని నిస్వార్థంగా నిర్వహించడంతోపాటు అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలన్నారు. నేడు సామాజిక మాధ్యమాల ప్రాధాన్యత పెరిగిందన్నారు. రాయగడ వంటి జిల్లాలో కొండలు, కొనల నడుమ ఎంతో మంది ఆదివాసీలు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని, ఇప్పటికీ వారిలో చైతన్యం కొరవడడంతో సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ఆయా ప్రాంతాల్లో గల సమస్యలను పాత్రికేయులు వెలికితీయాలన్నారు. వెబ్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్ సాహు అసోసియేషన్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం గౌరవ అతిథులుగా పాల్గొన్న జీఐఎసీఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత గోవింద ప్రసాద్ రథో, సెంచూరియన్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ రాజేష్ కుమార్ పాడీలు పాత్రికేయుల విలువలు గురించి ప్రసంగించారు. అనంతరం జిల్లాలోని కొంతమంది సీనియర్ పాత్రికేయులను సన్మానించారు.

వ్యాపారి అదృశ్యంపై ఫిర్యాదు

నరసన్నపేట: స్థానిక లక్ష్మన్నపేటకు చెందిన వ్యాపారి వెంకట పార్వతీశం గుప్త అదృశ్యమయ్యారు. ఆగస్టు 26న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని సోదరుడు మన్మథరావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గుప్త అదృశ్యం వెనుక పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గుప్తా బంగారు ఆభరణాలు ఒక చోట నుంచి మరొక చోటకు తరలిస్తుండటం, వ్యాపారులకు ఇస్తుండటం, రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తుండంతో పాటు లక్షల్లో లావాదేవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే మంగళవారం తన కారులో స్థానిక పురుషోత్తంనగర్‌కు చెందిన కారు డ్రైవర్‌తో కలిసి విశాఖ వెళ్లగా.. డ్రైవర్ ఆ రాత్రే ఇంటికి చేరుకున్నారని, గుప్తా మాత్రం రాలేదని సమాచారం. సోదరుడు ఫోన్ చేస్తే వేరే వ్యక్తి లిఫ్ట్ చేసి తనకు బస్సులో ఫోన్ దొరికిందని చెప్పారు. ఆయన చెప్పిన చోటకు వెళ్లి ఫోన్ తీసుకొచ్చారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేసు నమోదు చేశామని, విశాఖ పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

స్పోర్ట్స్ కోటా అమల్లో.. జాప్యమెందుకో?

- ఇంజినీరింగ్, ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లలో కానరాని కోటా
- శాప్ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- ప్రభుత్వం స్పందించాలని క్రీడాసంఘాల విజ్ఞప్తి



వాలీబాల్ సాధనలో విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్పోర్ట్స్ కోటా అమలు రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనుక్కి అన్న చందంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలు చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కాక వందలాది మంది క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్, ట్రిపుల్ ఐటీ క్లాసులు మొదలైపోయాయి. అయినా, స్పోర్ట్స్ కోటా ద్వారా భర్తీ కావాల్సిన సీట్లను సంబంధిత శాఖాధికారులు జాప్యం చేస్తుండటంతో విద్యార్థులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో పదుల సంఖ్యలో క్రీడాకారులు.. విద్యార్థులు ఎంసెట్, ట్రిపుల్‌ఐటీ సీట్ల రేసులో ఉన్నారు. వీరంతా ఇప్పటికే వివిధ క్రీడాంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించి జిల్లా కీర్తిని చాటిచెప్పారు. పతకాలు సాధించి సత్తాచాటారు. అయితే ఉన్నత చదువుల్లో అమలు కావాల్సిన స్పోర్ట్స్‌కోటాను అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో విద్యాసంవత్సరం కోల్పోయే పరిస్థితులు దాపరించాయి.

డీఎస్సీపైనే ఫోకస్..
స్పోర్ట్స్ కోటా భర్తీ చేపట్టాలని ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)కు ఆదేశించింది. అయితే శాప్ అధికారులు కేవలం డీఎస్సీ ఉద్యోగాలపై మాత్రమే ప్రస్తుతం ఫోకస్ చేస్తున్నారు. మిగిలిన ఉన్నత, ప్రొఫెషనల్, వృత్తివిద్యా కోర్సుల ప్రవేశాల సందర్భంగా స్పోర్ట్స్‌కోటా ద్వారా విద్యార్థుల భర్తీని విస్మరించారు. దీంతో ఎంసెట్, ట్రిపుల్ ఐటీ వంటి ఉన్నత చదువుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు నష్టపోతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని జిల్లాలోని క్రీడా విద్యార్థులు మొరపెట్టుకుంటున్నారు. విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ కోటా భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలని ఒలింపిక్ సంఘ నాయకులు, క్రీడాసంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి..
జిల్లాలో ఎంతోమంది ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారు. వీరంతా రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. వీరికి స్పోర్ట్స్ కోటా అమలులో అన్యాయం జరగకుండా ప్రభుత్వం దృష్టి సారించాలి.
–మొజ్జాడ వెంకటరమణ, పీడీ–పీఈటీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

కోటా అమలు చేయాలి..
రాష్ట్రంలో ఇంజినీరింగ్, ట్రిపుల్ ఐటీ తదితర కోర్సుల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాను అమలు చేయడంలో జాప్యం జరిగిందనే విషయం మా దృష్టికి కూడా వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి క్రీడాకారులకు న్యాయం చేయాలి.
– మెంటాడ సాంబమూర్తి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బీజేడీ యువ నాయకుడు రాజు మృతి



రాజు (ఫైల్)

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ప్రతిపక్ష బీజేడి యువ విభాగ పట్టణ కార్యదర్శి ఆనాల రాజు (పురుషోత్తం) (24) అనారోగ్యంతో మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజును మెరుగైన వైద్య చికిత్స కోసం ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరికి వెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయారు. రాజు మృతిపై రాజ్యసభ సభ్యుడు మున్నా ఖాన్, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, జెడ్పీ ప్రెసిడెంట్ మోతిరాం నాయక్, మాజీ ఎంపీలు రమేష్ మజ్జి, ప్రదీప్ మజ్జి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, బీజేడీ నాయకుడు తపస్ త్రిపాఠి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

• అన్న సంతర్పణ



ప్రజలకు అన్నప్రసాదాలను వడ్డిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



భారీ అన్న సంతర్పణ జరుగుతున్న దృశ్యం



తరలివచ్చిన భక్తులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని రాజు వీధిలోని సిద్ధి వినాయక దేవాలయం వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గత 15 ఏళ్లుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఈ కార్యక్రమానికి హాజరై స్వయంగా భక్తులకు ఆహారం వడ్డించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

రాయగడ: సదరు సమితి జేకేపూర్ సమీపంలో గల భట్టిపాడ నెహ్రూనగర్ కాలనీలో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గ్రామంలో గల 200 మంది పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది వినాయక ఉత్సవాలను గ్రామ యువకులు నిర్వహిస్తున్నారు. వినాయక కమిటీ తరఫున వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ప్రముఖ సమాజ సేవకుడు, శ్రీక్షేత్ర టౌన్‌షిప్ అధినేత దూడల శ్రీనివాస్ తెలిపారు.

సమస్యలతో సతమతం

- డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో సౌకర్యాల కొరత
- కన్నెత్తి చూడని కూటమి నేతలు
- ఏడాదిన్నరగా జరగని పాలక మండలి సమావేశాలు
- విద్యుత్, వసతి సమస్యలతో విద్యార్థుల ఇబ్బందులు
- సమావేశాలకు గైర్హాజరౌతున్న స్థానిక నేతలు



డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల : ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీని కూటమి పాలకులు గాలికొదిలేశారు. మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎవరు ముందుకు వస్తే ఎవరినెత్తిన భారం పడుతుందోనని కూటమి పాలకులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇక్కడ ప్రతి ఏడాది మహిళా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగా మహిళా వసతి గృహాలు లేవు. ప్రస్తుతానికి రెండు వసతి గృహాలు అవసరమున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు విద్యుత్, మైదానం వంటి సమస్యలు వేధిస్తున్నాయి.

పాలకమండలి సమావేశాలకు మోక్షమెప్పుడో?
వర్సిటీ పాలకమండలి సమావేశాలను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారి కూడా సమావేశాలను నిర్వహించలేదు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి అనుమతి ఇవ్వాలి. ఇప్పటి వరకూ ఈ సమావేశాలకు ఎటువంటి ఆదేశాలను ఉన్నత విద్యామండలి జారీ చేయకపోవటంతో సమావేశాలు నిర్వహించలేదు. పాలక మండలి సమావేశం జరిగితే వర్సిటీ సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలను చేపట్టేందుకు ఆస్కారముంటుంది.

వేధిస్తున్న విద్యుత్, వసతి సమస్యలు..
వర్సిటీలో ముఖ్యంగా విద్యుత్, వసతి సమస్యలు వేధిస్తున్నాయి. విద్యార్థినులకు రెండు వసతి గృహాలు అవసరం కాగా కనీసం ఒక్కటైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వర్సిటీకు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా లైన్ లేదు. ఎచ్చెర్లలో కరెంట్ పోతే వర్సిటీలో కూడా విద్యుత్ ఉండటం లేదు. దీంతో కంప్యూటర్లు కోర్సు చదివే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించడానికి కూడా వీలులేకుండా పోతోంది. అందుకే స్థానికంగా ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 11 కె.వి.స్మాల్ సబ్‌స్టేషన్‌ను వర్సిటీలో ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పట్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ఉన్న కళావెంకటరావు ఇక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చినా ఆ తర్వాత మర్చిపోయారు. విద్యార్థులకు సరిపడా మైదానం లేదు. ట్రాక్, పోల్స్ లేవు. ఆటలు ఆడుకునేందుకు వీలుగా మైదానం లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు.

ముఖం చాటేస్తున్న స్థానిక నేతలు..
అంబేద్కర్ వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాలకు స్థానికుల నాయకులకు ఆహ్వానం పంపిస్తున్నా వారు గైర్హాజరు అవుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ సమావేశాలకు హాజరైతే వర్సిటీ సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తారని, వాటిని పరిష్కరించాల్సి వస్తుందని హాజరుకావడం లేదని సమాచారం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానిక నేతలు వర్సిటీ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరై సమస్యలను పరిష్కరించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

రిమ్స్‌లో కొరవడిన నిఘా!

- 650 పడకలకే సెక్యూరిటీ కాంట్రాక్టర్ ఒప్పందం
- ఆస్పత్రిలో ఉన్న పడకల సంఖ్య 930
- పర్యవేక్షణ లేక తరచూ దొంగతనాలు



రిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది

శ్రీకాకుళం : నగరంలోని రిమ్స్ సర్వజన ఆస్పత్రిలో నిఘా కొరవడుతోంది. నిత్యం ఏదో ఒక వార్డులో రోగులు, రోగుల సహాయకులకు సంబంధించిన సెల్‌ఫోన్లు, డబ్బులు, మోటారు సైకిళ్లు చోరీకి గురికావడం పరిపాటిగా మారింది. దొంగతనాలకు సంబంధించి ఔట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో కొందరు రోగులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కూడా పాఠకులకు తెలిసిందే. తాజాగా జరిగిన ఓ సంఘటన ప్రమాదవశాత్తు జరిగినట్లు చెబుతున్న అది కూడా ఆత్మహత్య అని రిమ్స్ వర్గాల నుంచే వినిపిస్తోంది. కారణం ఏదైనప్పటికీ నిఘా కొరవడంతోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఇదేం లెక్క?
రిమ్స్ సర్వజన ఆసుపత్రి 930 పడకల స్థాయిలో ఉన్నప్పటికీ రాష్ట్రస్థాయిలో జరిగిన సెక్యూరిటీ ఒప్పందం మాత్రం 650కు మాత్రమే జరిగింది. రాష్ట్రస్థాయిలో ఉన్న లెక్కల ప్రకారం ఈ ఒప్పందం జరిగినట్లు కొందరు రిమ్స్ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తొలుత 650 పడకలకు సెక్యూరిటీ ఒప్పందం జరిగినా అటు తర్వాత మరో వంద పడకలకు పెంచుతూ కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ లెక్కన రాష్ట్రస్థాయిలో 750 పడకలకు లెక్కలు ఉండాలి. ఇందుకు భిన్నంగా 650 పడకలకే లెక్కలు ఉన్నట్లు చెబుతూ ఆ మేరకే ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. 2024 ఎన్నికల సమయంలో రిమ్స్ పడకల స్థాయి 930కి చేరింది. ఈ కారణంగానే అప్పట్లో 930 స్థాయికి సెక్యూరిటీని పెంచలేకపోయారు. అటు తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం 930కి కాకపోయినా గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు 750 పడకలకు కూడా సెక్యూరిటీ ఒప్పందాన్ని కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్యవేక్షణ గాలికి..
రిమ్సో నిఘా సిబ్బంది సక్రమంగా పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పడకల స్థాయి కంటే సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ వారితో సైతం సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోలేకపోతున్నారు. నిఘాను పర్యవేక్షించాల్సిన అధికారి తరచూ విధులకు గైర్హాజరవుతుండటంతో ఇటువంటి పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ అధికారి తన జాబ్ జార్టును వదిలి ఇతర రిమ్స్ అధికారుల విధుల్లో తలదూర్చడానికి ప్రాధాన్యత ఇస్తుంటారని రిమ్స్ వైద్యులే బహిరంగంగా చెబుతున్నారు ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి సక్రమంగా నిఘా అమలయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా


సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు ప్రథమస్థానం



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన విజయనగరం మహిళల జట్టు

బొబ్బిలిరూరల్: గుంటూరు జిల్లా సత్తెన పల్లి లయోలా కళాశాలలో శని, ఆదివారాల్లో జరిగిన 12వ అంతర్‌జిల్లా మహిళా సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన మహిళల జట్టు ప్రథమ స్థానం సాధించిందని పారాది జెడ్పీహెచ్‌ఎస్ పీడీలు నల్ల వెంకటనాయుడు, సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్రంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న జట్టుకు, శిక్షణ ఇచ్చిన పీడీలకు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బేబీనాయన అభినందనలు తెలిపారు.

రంగరాయపురంలో చేతబడి కలకలం



రంగరాయపురంలో ఓ ఇంటి వద్ద క్షుద్రపూజలు చేసి వేసి ఉన్న ముగ్గు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయ పురం, జమ్మాదేవిపేట గ్రామాల్లో చేతబడి కలకలం రేపింది. శనివారం రాత్రి గ్రామంలో ఓ ఇంటి ముందు ముగ్గులు వేసి మనిషి ఆకారంలో బొమ్మను తయారు చేసి మధ్యలో పెట్టి నిమ్మకాయలకు పసుపు, కుంకం రాసి కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు లోనయ్యారు. ఈ విధంగానే గత వారంలో కూడా ఒక వీధిలో చేశారని గ్రామస్తులు తెలిపారు. మరో ఇంటి వద్ద తాము లేని సమయంలో ద్వారబంధాల వద్ద నువ్వులు, నిమ్మకాయలను వేశారని ఆ ఇంటి యజమాని తెలిపారు. అలాగే జమ్మాదేవిపేట గ్రామంలో ఒక వ్యక్తి నూతనంగా ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసేందుకు ముహూర్తం పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోని ద్వారబంధాల వద్ద నల్ల నువ్వులను సుమారు 3కేజీలకు పైగా పోసి ఉన్నట్లు గుర్తించామని ఇంటి యజమానులు వాపోయారు. మండలంలో వరుసగా ఇటువంటి ఘటనలు జరగడంతో ప్రజలు భీతిల్లుతున్నారు. ఈ తరహా వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.

పశువుల వ్యాన్ల సీజ్

దత్తిరాజేరు: మండలంలోని మరడాం కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న రెండు పశువుల వ్యాన్లు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్. బూర్జవలస ఎస్సై జి.రాజేష్ ఆదివారం తెలిపారు. రాత్రి వేళల్లో వారపు తనిఖీల్లో భాగంగా ఆంధ్ర ఎస్సై సీతారాం తనిఖీలలో భాగంగా పట్టుకున్నట్లు చెప్పారు.సరైన పత్రాలు లేకుండా పశువులను అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికురాలి మృతి



చందక సత్యాలు మృతదేహం

కొమ్మాది(విశాఖ): జీవీఎంసీ 8వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి జారిపడి ఓ కార్మికురాలు మృతి చెందింది. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పీఎం పాలెం సీఐ జి. బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, గుర్ల మండలం, గొలగాం గ్రామానికి చెందిన చందక సత్యాలు (48), భర్త సింహాచలంతో కలిసి మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చారు. వారు ఆరిలోవలోని తోటగరువు వద్ద నివాసం ఉంటూ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. రుషికొండలోని తారకరామ లేఅవుట్‌లో గల ఆదిత్య అపార్ట్‌మెంట్ వెనుక నిర్మాణంలో ఉన్న ఒక భవనం వద్ద వారు కూలి పనులు చేస్తున్నారు. ఆదివారం మూడో అంతస్తులో శ్లాబ్ నిర్మాణం జరుగుతుండగా, పనిలో భాగంగా పైనున్న సత్యాలు కళ్లు తిరిగి మొదటి అంతస్తు శ్లాబ్‌పై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటల్లేవ్..ఆడుకోవడాల్లేవ్..!

- 15 కళాశాలలకు ఒకే పీడీ
- ఆటలకు దూరమవుతున్న ఇంటర్ విద్యార్థులు
- జిల్లావ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులు 5,800 మంది
- ఆటలాడించే గురువే కరువు
- వ్యాయామం, క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు



జూనియర్ కళాశాల విద్యార్థులు

పార్వతీపురం రూరల్: విద్యార్థుల్లో చురుకుదనాన్ని, ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపేందుకు ఎంతగానో దోహదపడేవి క్రీడలు, వ్యాయామం. ఇంటర్ విద్య నుంచి క్రీడలు, వ్యాయామం ప్రతి విద్యార్థికి అవసరం. విద్యార్థుల్లో ఆసక్తి ఉన్నా ఆడించేందుకు గురువులు కరువయ్యారు. సాధన చేయలేక, మెలకువలు చెప్పేవారే లేక, విద్యార్థులు ఉదాసీనంగా మిగిలిపోతున్నారు. ఇంటర్‌మీడియట్ రెండేళ్లలో ఉత్సాహంగా ఉన్న విద్యార్థులు క్రీడా జీవితాన్ని కోల్పోతున్నారు. ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న 14 జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు ఆటలకు నోచుకోవడం లేదు. ఈ పోటీ ప్రపంచంలో రాణించాలంటే కళాశాల విద్యార్థులకు చదువుతోపాటు ఇతర అంశాల్లో ప్రతిభ చాటితే కచ్చితమైన ఉజ్వల భవిష్యత్‌కు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది.

నష్టపోతోంది పేద విద్యార్థులే

పల్లె, పట్టణ ప్రాంతాల్లో దిగువ, మధ్యతరగతి కుటుంబాలకుచెందిన విద్యార్థులు ప్రధానంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతారు. నేటి పోటీ ప్రపంచంలో వారికున్న అవకాశాలను వినియోగించుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు కలలు కంటారు. విద్యతోపాటు మరో నైపుణ్యం కలిగి ఉండాల్సిన తప్పనిసరి పరిస్థితులు నేడు సంతరించుకున్న నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు లేక జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 15 కళాశాలల్లోని 5,800మంది విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అలాగే క్రీడలకు, వ్యాయామానికి సంబంధించిన పరికరాలు కొనుగోలు చేసేందుకు కూడా ప్రభుత్వం ఒక్క రూపాయి కేటాయించలేదు. ఏ విద్యార్థి అయినా తనకు ఉత్సాహంగా ఉండి క్రీడల్లో రాణించాలని కోరిక ఉన్నప్పటికీ సొంతంగా సాధన చేసేందుకైనా అవకాశం లేని పరిస్థితులు జూనియర్ కళాశాలల్లో వేలెత్తి చూపుతున్నాయి. దీంతో క్రీడల్లో ప్రోత్సాహం కరువై క్రమంగా విద్యార్థులకు ఆటలపై ఆసక్తి తగ్గుతోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేవారికి క్రీడా కోటా కింద రిజర్వేషన్ వర్తిస్తుంది. చదువుకు ఇది అదనపు అర్హతగా గుర్తింపునిస్తుంది. అయితే ప్రస్తుతం ప్రభుత్వ నిర్లక్ష్యంతో జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు ఈ అవకాశాలు కోల్పోతున్నారు.



సాలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

పీడీలు లేరు..భోజనానికి బిల్లులులేవు



జిల్లాలో గల ప్రభుత్వ 14 జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పీడీలు లేకపోవడం దారుణం. విద్యార్థులు కోల్పోతున్న క్రీడాజీవితం పాపం ప్రభుత్వానిదే. అలాగే విద్యార్థులకు సంబంధించిన మధ్యాహ్న భోజనాల బిల్లులను ప్రభుత్వం నేటికీ చెల్లించలేదు. భోజనానికి బిల్లులు సమయానికి చెల్లించకపోవడానికి ప్రధాన కారణం జిల్లా విద్యాశాఖాధికారి నిర్లక్ష్యమే. నెలల తరబడి బిల్లుల బకాయిలు చెల్లింపులు జరగకపోతే నిర్వహణ ఎలా జరుగుతుంది? ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీల(వ్యాయామ అధ్యాపకులు)ను నియమించాలని డిమాండ్ చేస్తున్నాం. ఇంటర్ విద్యార్థులకు ఈ దశలో వ్యాయామం, క్రీడలు చాలా అవసరం.

– పాలక రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమసంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

ఉద్యోగులకు ఉత్తమ సేవలతో గుర్తింపు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీఓను సత్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించడం ద్వారా ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి ప్రజలకు మంచి సేవలందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. మెంటాడ మండల ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన బీఎస్‌కేఎన్ పట్నాయక్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన పట్నాయక్ దంపతులను దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించడం తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వంతో ఆరోగ్యం



పోలీసు అధికారులతో పాటు ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, విద్యార్థులు, స్థానికులు

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో ఫిట్ ఇండియా సైక్లింగ్ ఆన్ సండే

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సైక్లింగ్ ఆన్ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దృఢత్వంతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రజలకు ఈ మేరకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుతం మన జీవన శైలిలో ప్రతీ రోజు ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణిస్తూ ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ శారీరక చురుకుదనం లేకపోవడంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు సైక్లింగ్ సాధారణ ఆరోగ్య పరిరక్షణ కోసం ఒక సరళమైన, సురక్షితమైన మార్గంతో పాటు పర్యావరణాన్ని కొంత మేరకు కాపాడుకొనేందుకు ఆస్కారం ఉంటుందని ఎస్పీ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జిల్లా కేంద్రం మీదుగా వెళ్లి మళ్లీ మైదానానికి చేరుకుంది. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్‌ఐలు రాంబాబు, నాయుడు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు తదితర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లారీలను ఢీకొట్టిన టిప్పర్

- క్లీనర్ మృతి, డ్రైవర్‌కు గాయాలు





వెంకటరమణ మృతదేహం, (ఇన్‌సెట్లో) వెంకటరమణ (ఫైల్)



నుజ్జునుజ్జు అయిన టిప్పర్ క్యాబిన్

గంట్యాడ: ఆగిఉన్న రెండు లారీలను ఓ టిప్పర్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని రామవరం జాతీయ రహదారిపై ఆదివారం తెలవారుజామున 2 గంటల సమయంలో రెండు లారీలు ఆగి ఉన్నాయి. విశాఖపట్నం పోర్టు నుంచి బొగ్గులోడుతో బొబ్బిలి వెళ్తున్న టిప్పర్ ఆగిఉన్న ఆ రెండులారీలను బలంగా ఢీకొట్టడంతో ఒకలారీ కిందికి బోల్తాపడింది. దానిముందు ఉన్న లారీని ఢీకొట్టడంతో టిప్పర్ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. దీంతో క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు క్రేన్ సహాయంతో అతన్ని బయటకు తీశారు. అయితే అప్పటికే క్లీనర్ కోన వెంకటరమణ మృతి చెందాడు. ఈ ఘటనలో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. మృతుడిది అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం కింతాడ పంచాయతీ పరిధిలోని గొల్లలపాలెం గ్రామం. మృతుడికి భార్య భవాని, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



ఆచూకీ తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: కోరుకొండ అలమండ రైల్వే స్టేషన్ ల మధ్య రైలు పట్టాల పై గుర్తుతెలియని మృతదేహాన్ని జీఆర్పీ సిబ్బంది ఆదివారం కనుగొన్నారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 మధ్య ఉంటుందని సమారు 5 అడుగుల 5 అంగుళాల పొడవుతో ఛామనఛాయ రంగు కలిగి నలుపు రంగు, చిన్న,చిన్న తెలుపురంగు పువ్వుల గల ఫుల్ హ్యాండ్స్ షర్ట్, నీలం రంగు షార్ట్ ధరించి ఉన్నాడని జీఆర్పీ ఎస్సై బాలాజీ రావు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 919490617089, 6301365605 నంబర్లకు కానీ ల్యాండ్‌లైన్ నంబర్ 08912883218కు కానీ ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



బంగారిదొర మృతదేహాన్ని బయటకు తెస్తున్న కుటుంబసభ్యులు

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస సమీపంలో ఉన్న బడిదేవరమ్మ చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు శనివారం మధ్యాహ్నం చెరువులో గల్లంతైన పాడి బంగారి దొర(45) మృతదేహం అర్ధరాత్రి 1గంట ప్రాంతంలో లభ్యమైంది. ఈ మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి తెలిపారు. రెస్క్యూ బృందం సహాయంతో గాలించి జేసీబీ సాయంతో గట్టు తొలగించి నీరు మళ్లించిన అనంతరం బంగారి దొర మృతదేహం ఆచూకీ తెలిసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి మృతదేహాన్ని తరలించామని చెప్పారు.

శ్రీమద్రమారమణ గోవిందా..హరి!

- హరికథా పితామహుడికి..ఘనంగా నీరాజనం
- భక్తిశ్రద్ధలతో ఆదిభట్ల 161వ జయంతి మహోత్సవాలు
- ఆకట్టుకున్న 'సర్వారాయ' విద్యార్థినుల గానామృతం



సంగీత, నృత్యకళాశాలలో ఆదిభట్ల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సంఘం ప్రతినిధులు



హరికథా గానాలాపన చేస్తున్న కపిలేశ్వరపురం సర్వారాయ పాఠశాల విద్యార్థినులు

విజయనగరం టౌన్: హరికథా పితామహుడికి విజయనగర వాసులు ఘనంగా నీరాజనం పలికారు. శ్రీమదజ్జాడాదిభట్ల నారాయణదాస 161వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీ ఆదిభట్ల నారాయణదాస ఆరాధనోత్సవ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు నేతృత్వంలో ఆదివారం ఉదయం కానుకుర్తివారి వీధిలో ఉన్న ఆదిభట్ల గృహంలో పూజలు నిర్వహించారు. అనంతరం వెన్‌లాక్ పార్కు, సంగీత కళాశాలలో ఉన్న ఆదిభట్ల విగ్రహానికి పుష్పమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో కపిలేశ్వరపురం శ్రీ సర్వారాయ హరికథా పాఠశాల విద్యార్థినులు నిర్వహించిన హరికథా గానామృతం ఆద్యంతం ప్రేక్షలకులను కట్టిపడేసింది. ఎం.వీరసత్య (అమలాపురం) శ్రీరామ జననం రక్తికట్టించింది. ఎం.సిరివల్లి (గుంటూరు) విశ్వామిత్ర యాగ సంరక్షణం హరికథ ఆకట్టుకుంది. సాయంత్రం 6గంటలకు ఆదిభట్ల రవిభాగవతార్‌తో, 7 గంటలకు హరికథా చూడామణి వై.శిఖామణి భాగవతారిణితో శ్రీరామపాదుకా పట్టాభిషేకం, హరికథలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఆరాధనోత్సవ సంఘం ప్రతినిధులు పీవీ.నరసింహరాజు(బుచ్చిబాబు) అధిక సంఖ్యలో సభ్యులు, హరికథా కళాకారులు పాల్గొన్నారు.

నేడు హరికథా చూడామణి బిరుదు ప్రదానం

ఆదిభట్ల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రెండోరోజు సోమవారం ఉదయం 10 గంటలకు ఆర్.గీత (కర్ణాటక) సీతా కల్యాణం, 11 గంటలకు మండా వరలక్ష్మి భాగవతారిణి హరికథ, సాయంత్రం హరికథాచూడామణి కాళ్ల నిర్మల సుందరకాండ హరికథ ఉంటాయి. అనంతరం నిర్వహించే సభా కార్యక్రమంలో ప్రొద్దుటూరు శ్రీ అన్నమాచార్య కళాపీఠంకి చెందిన యడ్లవల్లి రమణయ్య భాగవతార్‌కు హరికథా చూడామణి బిరుదు ప్రదానం చేయనున్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా పురస్కార ప్రదానం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. రాత్రి పురస్కార గ్రహీత భక్త మార్కండేయ కథాగానాలాపన చేస్తారన్నారు. సాహితీవేత్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

అజరామరం ఆదిభట్ల కీర్తి



ఆదిభట్ల స్వగృహంలో కథాస్రవంతి నిర్వాహకులను సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 161వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీ ఆదిభట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కానుకుర్తివారి వీధిలోగల ఆదిభట్ల స్వగృహంలో నిర్వహించిన భాగవతార్ కట్టా జేజీ నారాయణ హరికథ గానామృతం అందరినీ ఆకట్టుకుంది. ఆదిభట్ల మునిమనుమడు ఆనంద నారాయణ దాసు సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కథా స్రవంతి నిర్వాహకులు పప్పు వెంకట భోగారావు, భాగవతార్ జేజీ నారాయణలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొబ్బిలి ఉప ఖజానా అధికారి పి.వి.పద్మనాభం, గౌరవ అతిథిగా న్యాయవాది ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్‌వీ ఆర్‌ఎం రాజు, బ్రహ్మానంద శాస్త్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాహిత్య రూపంలో, కథల రూపంలో ఆదిభట్ల నారాయణ దాసు రచనలు, వారి జీవిత చరిత్ర నేటి తరానికి తెలియపరచాలని ఆకాంక్షించారు. ఆదిభట్ల నారాయణ దాసుపై రచించిన ఎనిమిది పుస్తకాలను ఆహూతులకు చూపించారు. కార్యక్రమంలో మంజూష, మండపాక రవి, బీజేపీ రాష్ట్ర సభ్యుడు శివ ప్రసాద రెడ్డి, ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, శ్రీకాంత్, కళాభిమానులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ఫోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం: అంతర్ జిల్లా ఫెన్సింగ్ పోటీల్లో మండలంలోని కన్నయ్యగూడకు చెందిన విద్యార్థినులు తోయక యమున, తోయక భానుమతిలు ప్రతిభ కనబరిచారు. ఆగస్టు 30వ తేదీన భీమవరంలో జరిగిన 11వ క్యాడెట్ అండర్–17 అంతర్ జిల్లా బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని, ఇప్పీ టీమ్ విభాగంలో యమున వెండి పతకం, ఫోయిల్ టీమ్ విభాగంలో భానుమతి రజ త పతకం సాధించినట్లు కోచ్ బాలరాజు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఇరువురు బాలికలను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మోటారు వాహన చట్టాలను వ్యతిరేకించండి

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మోటారు వాహన చట్టాలను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, ఆటో వర్కర్ల సంఘ నాయకులు ఎల్లంనాయుడు తదితరులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం కఠిన చట్టాలు తెచ్చి జరిమానాలు, జైలుశిక్షలను వేధిస్తోందన్నారు. దేశంలోని రవాణా రంగాన్ని ప్రైవేటుకు అప్పగించే కుట్రకు కేంద్రం దారులు తెరిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్, బ్రేక్, ఫిట్నెస్ తదితర ధ్రువపత్రాల పేరిట భారీ చలానాలు విధించి మోటారు కార్మికుల కష్టాన్ని దోచుకుంటోందన్నారు. ఇది సరిపోక ఉచిత బస్సు పేరిట ఆటో కార్మికులను వీధిన పడేసిందన్నారు. వారందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషించుకునేందుకు కూడా కనీసం అవకాశం లేకుండా చేసిందన్నారు. వీరందరినీ ఆదుకోవాలని కోరుతూ సెప్టెంబర్ 4న ఉదయం 9 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'టోల్' ఊరట..!


- రూ.3 వేలతో ఫాస్టాగ్ టోల్ పాస్
- ఏడాది కాలం లేదా 200 ట్రిప్పులకు చెల్లుబాటు
- ఆగస్టు 15 నుంచి అమలులోకి..
- సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న కేంద్రం

భోగాపురం: జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. నాలుగు చక్రాల వాహనాలు సహా ఆపై పెద్ద వాహనాలు నడిపే వారంతా టోల్‌గేట్ దాటినప్పుడల్లా టోల్ చార్జీ చెల్లించకుండా ఉండేలా కొత్తగా టోల్‌పాస్ విధానాన్ని తీసుకువచ్చింది. ఇదివరకు మనం వెళ్లే దారిలో ఎన్నిసార్లు మనం వాహనంతో టోల్‌గేటు దాటితే అన్నిసార్లు టోల్‌చార్జీ కట్టాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ కొత్త విధానం ద్వారా రూ.3 వేలకు ఫాస్టాగ్ టోల్‌పాస్ జారీ చేస్తారు. దీంతో ఏడాది కాలం పాటు గానీ 200 ట్రిప్పుల వరకు గానీ టోల్ గేటు గుండా ఫ్రీ(ఉచితం)గా ప్రయాణం చేయవచ్చు.

ట్రిప్పులు ఇలా లెక్కిస్తారు..

గతంలో మనం రహదారులపై ప్రయాణించేటప్పుడు ఎన్నిచోట్ల టోల్‌గేట్లు వస్తే అన్నిచోట్లా టోల్‌చార్జీలు చెల్లించి, ముందుకు వెళ్లాల్సి వచ్చేది. ఇలా వెళ్లేటప్పుడు ఒక్కో ట్రిప్పుకు ఇరువైపులా రూ.90 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు ఆ భారం లేకుండా ఎన్‌హెచ్(జాతీయ రహదారి) అధికారులు పాస్ విధానం అమలులోకి తెచ్చారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఈ విధానం కార్లు, జీపులు, వ్యాన్లు తదితర వాణిజ్యేతర వాహనాలకు వర్తిస్తుంది. ఒకసారి రూ.3 వేలు పెట్టి పాస్ తీసుకుంటే సంవత్సరం వరకు లేదా 200 ట్రిప్పుల వరకు ఉచితంగా టోల్‌గేటు గుండా వెళ్లవచ్చు. అయితే ఒకసారి టోల్‌గేటు దాటితే ఒక ట్రిప్పుగా పరిగణిస్తారు.

వీటిలో ఏది ముందు అయిపోతే దానిని పరిగణనలోకి తీసుకుని, ఆ తర్వాత పాస్ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.



భోగాపురం సమీపంలోని నాతవలస టోల్‌గేట్

దేశవ్యాప్తంగా 1,087 టోల్‌గేట్లు

దేశవ్యాప్తంగా సుమారు 1,087 వరకు టోల్ గేట్లు ఉన్నాయని అంచనా. విజయనగరం జిల్లాలో నాతవలస, జొన్నాడ, గంట్యాడ, శ్రీకాకుళం జిల్లాలో చిలకలపాలెం, మండపం, తర్లువాడ, విశాఖపట్నం జిల్లాలో అనకాపల్లి, అగనంపూడి వద్ద టోల్ గేట్లు కనిపిస్తాయి.

పాస్ పొందే విధానం

ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్న వాహన యాజమానులు తమ ఖాతా నుంచి ఫాస్టాగ్ పాస్ పొందవచ్చు. ఆగస్టు 15 నుంచి పెద్ద ఎత్తున వీటిని వాహనదారులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ పాస్ సొంత కార్లు, వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. బస్సులు, లారీలు, ట్యాక్సీలు, రవాణా వాహనాలకు చెల్లదు. ట్రావెల్స్‌కు వినియోగించే కార్లకు, జీపులు, వ్యాన్‌లకు కూడా వర్తించదు. ఈ ఫాస్టాగ్ ఏడాది పాస్ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించే జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్ రహదారులలోని అన్ని టోల్ ప్లాజాలలో పని చేస్తుంది.

డిజిటల్ రూపంలోనూ..

ఫాస్టాగ్ ఏడాది పాస్‌ను డిజిటల్‌గా తీసుకోవచ్చు. రాజమార్గ్ యాత్ర యాప్‌నుసెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పొందవచ్చు. లేదా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా లభిస్తుంది. దీని కోసం రూ.3 వేలు చెల్లించాలి. సంబంధిత వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫాస్టాగ్ ఉండాలి. బ్లాక్ లిస్టులో ఉండకూడదు. సంబంధిత వాహన రిజిస్ట్రేషన్ నంబర్ వివరాలు నమోదు చేయాలి. రూ3 వేలు చెల్లించిన తర్వాత ఏడాది పాస్ సంబంధిత వాహన ప్రస్తుత ఫాస్టాగ్ ట్యాగ్‌కు లింక్ అవుతుంది.